క్లుప్తంగా

భూ దేవి హిల్స్ ఏ బ్లాక్ అధ్యక్షుడిగా సోమయ్య

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని భూదేవి హిల్స్ ఏ బ్లాక్ అధ్యక్షులుగా సోమయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పజెప్పిన భూదేవి హిల్స్ వ్యవస్థాపకులు బాలకృష్ణ, కాలనీ వాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కాలనీ వాసులతో కలిసిన ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ జగన్‌ల ఆశీర్వాదం తీసుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు..

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శనివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు ఎమ్మెల్సీని కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామని, గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది నిధులను వెచ్చించి రోడ్లు, డ్రైనేజీ, వరదనీటి కాలువలతో పాటు ఫ్లైఓవర్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

పాత ఇళ్లను కూల్చివేయండి


శిథిలావస్థకు చేరిన ఇంటిని పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ..

దుండిగల్: శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నివసిస్తున్న వారిని వెంటనే ఖాళీ చేయించి నిర్మాణాలను కూల్చివేయాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్ వార్డులో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. గాలివానకు నేలకొరిగిన చెట్లను తొలగించారు. వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. మల్లంపేటలోని కొత్తకుంట చెరువు ముంపునకు గురైన బిహార్ బస్తీ వాసులకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ప్యానెల్ బోర్డుకు మరమ్మతులు


ప్యానెల్ బోర్డు వద్ద మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

చింతల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు జగద్గిరిగుట్ట రిజర్వాయర్ వద్ద విద్యుత్ ప్యానెల్ బోర్డు తినడంతో నీటి సరఫరా నిలిచిపోయి పలు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం ఉదయం ప్యానల్ బోర్డులో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన అధికారులు శనివారం మరమ్మతులు చేపట్టిన అధికారులు శనివారం నీటి సరఫరాను పునరుద్ధరించారు. కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్ రెడ్డి, వాటర్ ఎలక్ట్రికల్ మేనేజర్ అమర్నాథ్ ప్యానల్ మరమ్మతు పనులను పర్యవేక్షించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


మేయర్ కొలన్ నీలారెడ్డిని సత్కరించిన బాలాజీ హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

నిజాంపేట్: ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగు పరుస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ 12వ డివిజన్ పరిధి బాలాజీ హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మేయర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. గగన్ సాయి ఎన్‌క్లేవ్ నుంచి హరితవనం అపార్ట్‌మెంట్స్ వరకు భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేయడంలో సహకరించిన మేయర్‌ను ఈ సందర్భంగా కాలనీ వాసులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

పట్టణ సమాఖ్యలో లెక్కల పంచాయితీ

- పట్టణ మహిళా సమాఖ్యలో అవకతవకలు
- రూ.12 లక్షలపై తేలని లెక్కలు
- మాజీ అధ్యక్షురాలిపై నూతన కమిటీ సభ్యుల ఆగ్రహం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- ఎమ్మెల్యే దృష్టికి వివాదం


జీహెచ్ఎంసీ అధికారి సౌజన్యకు ఫిర్యాదు చేస్తున్న పట్టణ సమాఖ్య సభ్యులు..

కుత్బుల్లాపూర్: పొదుపు మహిళా సంఘాలకు ఆదర్శంగా ఉండాల్సిన పట్టణ సమాఖ్య వివాదాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తోంది.. ప్రాజెక్టు అధికారి హరిప్రియ అండదండలతో గతంలో అధ్యక్షురాలిగా పనిచేసిన విజయలక్ష్మి ఇప్పటికే రూ.12 లక్షల లెక్కల విషయంపై క్లారిటీ ఇవ్వకపోవడంతో నూతన కమిటీ సభ్యులు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు సౌజన్య, విజయలక్ష్మి లకు ఫిర్యాదు చేయడంతో మరోసారి వివాదం రాజుకుంటోంది.. గత కొంతకాలంగా గాజులరామారం సర్కిల్ పరిధిలోని పట్టణ సఖ్యలో నిధులు దుర్వినియోగంపై వివాదం కొనసాగుతోంది. ఈ విషయంపై ఫిర్యాదు చేసినా ప్రాజెక్టు అధికారి హరిప్రియ మెజార్టీ సభ్యుల అంగీకారాన్ని పక్కనపెట్టి తన సొంత ఎజెండాతో పాత కమిటీకే వత్తాసు పలకడం ఇప్పుడు కొత్త చిక్కులు తెచ్చి పెట్టింది.. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడ్డ కమిటీ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. అధ్యక్షురాలు విజయలక్ష్మి, ప్రాజెక్టు అధికారి హరిప్రియ కనుసన్నలోనే డబ్బులు మాయమైనట్లు మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి.

గతంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్ వద్ద పంచాయితీ..

గాజులరామారం పట్టణ సమాఖ్య గ్రూపు సభ్యుల లొల్లి గత ఎనిమిది నెలలుగా కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో మార్చి నెలలో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. పాత కమిటీ వద్ద రావాల్సిన రూపం రూ.12 లక్షలు వసూలు చేయాలని నిర్ణయించారు. అప్పటి నుంచి మాజీ అధ్యక్షురాలు డబ్బులు ఇవ్వకపోగా ఎమ్మెల్యే వివేకానంద, కార్పొరేటర్ రావుల శేషగిరి సమక్షంలో పంచాయితీ పెట్టారు.. ఇదిగో ఇస్తాం ..అదిగో ఇస్తామంటూ కాలయాపన చేస్తూనే ఉన్నారు. కొత్త కమిటీ ఏర్పడగానే ప్రాజెక్టు అధికారి హరిప్రియ సభ్యుల జాబితాను బ్యాంకు అధికారులకు అందజేయాలి. అయితే అందుకు విరుద్ధంగా పాత కమిటీకి అనుకూలంగా వ్యవహరిస్తుండటంతో నూతన కమిటీ సభ్యులు వారి వ్యవహార శైలి పై అనుమానం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలి

పట్టణ సమాఖ్యలో ఎదురైన ఇబ్బందులను పరిష్కరించకుండా మాజీ అధ్యక్షురాలికి వత్తాసు పలుకుతున్న హరిప్రియ పై చర్యలు తీసుకోవాలని, పాత కమిటీ అధ్యక్షురాలు విజయలక్ష్మిపై విచారణ జరిపి డబ్బులు వసూలు చేయాలని కోరుతూ నూతన కమిటీ అధ్యక్షురాలు హైమావతి, ప్రధాన కార్యదర్శి సంధ్యారెడ్డి, ఉపాధ్యక్షురాలు రూతు, కోశాధికారి ఆసియా, సమైక్య ప్రెసిడెంట్ దేవ కరుణ, గీత, అరుణ, రమ, వరలక్ష్మి, చంద్రకళ, తిరిజా, షమీమా జీహెచ్ఎంసీ గ్రేటర్ అధికారి సౌజన్యకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కాగా నూతన కమిటీ సభ్యులు బాలనగర్‌లోని ఇండియన్ బ్యాంక్‌కు వెళ్లి అకౌంట్ విషయంపై ఆరా తీయగా ప్రాజెక్టు అధికారి హరిప్రియ మాత్రం పాత కమిటీ మార్చకూడదని లెటర్ ఇచ్చినట్లు బ్యాంక్ అధికారులు చెప్పడంతో వారు అవాక్కయ్యారు. ఇదే విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు...

వారు అలాగే చెబుతారు: హరిప్రియ

అవినీతి ఆరోపణలపై ప్రాజెక్టు అధికారి హరిప్రియను 'సాక్షి' వివరణ కోరగా... వాళ్లు అలాగే ఆరోపణలు చేస్తారు. ఉన్నతాధికారుల సూచన మేరకే నేను నడుచుకున్నా. ఏమైనా ఉంటే సర్కిల్ ఉప కమిషనర్ అడగండి. లేదా మీరు నేరుగా వచ్చి నాతో మాట్లాడితే పూర్తి వివరాలు చెబుతానంటూ ఫోన్ కట్ చేశారు.

పేదలకు న్యాయం చేయండి



కుత్బుల్లాపూర్: జీవో 58 ,59 కింద దరఖాస్తు చేసుకున్న పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించి వారికి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం సచివాలయంలో చేవెళ్ల ఎం.పీ రంజిత్ రెడ్డి ,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ప్రభుత్వ విప్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

బీజేపీ పాలనలో గిరిజనులకు భద్రత కరువు


దిష్టి బొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

జగద్గిరిగుట్ట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో దళితులు, గిరిజనులు, మహిళలకు భద్రత కరువైందని సీపీఐ నాయకులు అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట, మగ్దూం నగర్ పార్టీ కార్యాలయం వద్ద మణిపూర్‌లో మహిళలపై జరిగిన అత్యాచారాలకు నిరసనగా సీపీఐ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ ఘటన దురదృష్టకరమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. 70 రోజుల వరకు నిందితులను అరెస్టు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నిమోజక వర్గ కార్యదర్శి ఉమా మహేష్, సీనియర్ నాయకులు ఏసురత్నం, మహిళా సమాఖ్య కార్యదర్శి హైమావతి, దుర్గయ్య, హరినాథ్, సహదేవ్, సదానంద్, కృష్ణ, రాములు, శ్రీనివాస్, మహేశ్వరి, లక్ష్మీ, సంతోష్, సుధాకర్, వెంకటేష్, ప్రభాకర్, శేకర్, ఖయ్యూం, ఉపేందర్, సహస్ర, అక్షిత, భూమి, భవ్య, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

'అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి'

ఆల్విన్‌కాలనీ: భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు.శనివారం ఆయన అధికారులతో కలిసి ఎల్లమ్మబండ ప్రధాన రహదారిపై నిలిచిన వరద నీటిని పరిశీలించారు. జీహెచ్‌యంసి మాన్సూన్ ఎమర్జెనీ సిబ్బందిని పిలిపించి నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు. లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

బాలానగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో బాలానగర్ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు ఉప్పొంగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి శనివారం పలు కాలనీల్లో పర్యటించారు. సమస్యను పరిష్కరిందుకు అక్కడికక్కడే చర్యలు తీసుకున్నారు. మరో రెండురోజుల పాటు భారీ వర్షాలు కురవవచ్చునని వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులను అప్రమత్తం చేసి డ్రైనేజీ సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ముమ్మరంగా సహాయక చర్యలు


ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కొంపల్లి మున్సిపల్ చైర్మన్ శ్రీశైలం యాదవ్

కుత్బుల్లాపూర్: వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేశామని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. శనివారం ఆయన అధికారులతో కలిసి ముంపునకు గురైన ఉమా మహేశ్వర కాలనీ, జయభేరి పార్క్, అశోక అలా మైసన్, నూజివీడు సీడ్స్ కంపెనీ ప్రాంతాల్లో పర్యటించారు. వరదనీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, కమిషనర్ శ్రీహరి, కౌన్సిలర్ చింతల రవీందర్ యాదవ్, సిబ్బంది ఉన్నారు.

వృద్ధుడు అదృశ్యం


చిట్టిమను వీర్రాజు(ఫైల్)

కుత్బుల్లాపూర్: ఇంటి నుంచి బయటికి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొంపల్లి శివాలయం సమీపంలో నివాసముండే చిట్టిమను వీర్రాజు (59) గత నెల 28న ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగిరాలేదు. అతడి కోసం గాలింపు చేపట్టిన కుటుంబ సభ్యులు ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

సుభాష్‌నగర్: ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కైసర్‌నగర్‌కు చెందిన శాంతమ్మ (42) స్థానికంగా ఉల్లాస్ దాబాలో పని చేస్తుంది. శుక్రవారం రాత్రి విధులు ముగించుకున్న తరువాత ఇంటికి వెళ్తుండగా కైసర్‌నగర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ సముదాయం సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శాంతమ్మను స్థానికులు బాచుపల్లిలోని మమత ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్ డీసీపీగా శబరీష్ బాధ్యతల స్వీకరణ


మేడ్చల్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన శబరీష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీపీ సందీప్ గోనె..

కుత్బుల్లాపూర్: మేడ్చల్ డీసీపీగా శబరీష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన డీసీపీ సందీప్ గోనె మాదాపూర్‌కు బదిలీపై వెళ్లడంతో నగరంలో జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్న శబరీష్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. పేట్‌బషీరాబాద్, మేడ్చల్ ఏసీపీలతో పాటు శామీర్‌పేట్, అల్వాల్, జీడిమెట్ల, పేట్ బషీరాబాద్, మేడ్చల్, సూరారం, దుండిగల్ పోలీస్ స్టేషన్లు మేడ్చల్ డివిజన్ పరిధిలోకి వస్తాయి.. నేరాలను కట్టడి చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తానని నూతన డీసీపీ శబరీష్ అన్నారు.. అంతకుముందు డీసీపీ సందీప్ ఆయన బొకే అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన ఏసీపీ, సీఐలు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పేట్‌బషీరాబాద్ ఏసీపీగా రఘునందన్‌రావు నియమితులయ్యారు.



రోడ్డు దాటాలంటే సర్కస్ చేయాల్సిందే..


ధ్వంసమైన రోడ్డు..

దుండిగల్: దుండిగల్ ప్రాంతంలో ప్రజలు రోడ్డెక్కాలంటేనే భయ పడుతున్నారు. రోడ్డు మధ్యలో ఏర్పడిన భారీ గుంతలతో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇక ద్విచక్ర వాహనదారులు సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నాయి. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారులు ధ్వంసం కావడంతో పరిస్థితి మరీ దారుణంగా మారింది. రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతల్లో నీరు చేరడంతో వాటిని గమనించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దుండిగల్ తండా-2, గాగిల్లాపూర్‌కు వెళ్లే రోడ్డుపై పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సర్వాపూర్ రహదారి నుంచి తాండాల వరకు సుమారు 1.5 కిలోమీటర్ల మేర ప్రధాన రోడ్డు ఉంది. రోడ్డు సరిగా లేకపోవడంతో బస్సు సర్వీసులను కూడా నిలిపివేశారు. ఆటోలు కూడా రాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు సర్వాపూర్ రహదారి వరకు కాలినడకనే వెళ్లాల్సి వస్తోంది. ఈ రెండు తాండాల్లో పలు పరిశ్రమలు ఉండడంతో పాటు దీనికి ఖాజిపల్లి, గడ్డపోతారం పారిశ్రామికవాడల్లోని పరిశ్రమలకు ఈ రోడ్డు దగ్గరి దారి కావడంతో నిత్యం వేలాది భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


దుండిగల్ తాండా-2, గాగిల్లాపూర్ తాండాలకు వెళ్లే రోడ్డుపై నిలిచిన నీరు


రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలు..

వరద నివారణకు ప్రత్యేక చర్యలు


వరద ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్..

కుత్బుల్లాపూర్: లోతట్టు ప్రాంతాలు వరద ముంపు బారిన పడకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం ఆయన అధికారులతో కలిసి సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులోని మిత్ర హోమ్స్‌లోని ముంపు ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదనీరు సాఫీగా వెళ్లేందుకు నాలాలు, కల్వర్టుల విస్తరణతో పాటు బాక్స్ డ్రెయిన్‌ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. గతంలో పోలిస్తే ముంపు సమస్య తీవ్రత తగ్గిందన్నారు. ఆయన వెంట డివిజన్ల అధ్యక్షులు పోలె శ్రీకాంత్, రుద్రా అశోక్, పుప్పాల భాస్కర్, సంపత్ మాధవ రెడ్డి, కస్తూరి బాల రాజు తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన

◆ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ప్రగతినగర్‌లోని స్మశాన వాటిక, డంపింగ్ యార్డ్ స్థలాలను ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వెలువెత్తుతున్న నేపథ్యంలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆయా ప్రాంతాలను సందర్శించారు. ఆక్రమణలను ఉపేక్షించేది లేదని, రూ.50 లక్షలతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

వాన వెలిసింది.. నీరు మిగిలింది


ఓక్షిత ఎన్‌క్లేవ్‌లో వాహనదారుల ఇబ్బందులు


గాజులరామారం-మెట్‌కానిగూడ రోడ్డులో చేరిన వరదనీరు


నిండు కుండలా మల్లంపేట్‌లోని కత్వా చెరువు

కుత్బుల్లాపూర్: శనివారం వర్షం కొంత తెరిపి ఇచ్చినా ముంపు ప్రాంతాల్లో వరద నీటితో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గాజులరామారం-మెట్‌కాని గూడ రోడ్డులో, ఓక్షిత ఎన్‌క్లేవ్, దూలపల్లిలోని సెయింట్ మార్టిన్స్ కళాశాల ఎదుట, రంగారెడ్డినగర్, పంచశీల కాలనీ, సూరారం తదితర ప్రాంతాల్లో వరద నీరు చేరింది. పలు చెరువులు, కుంటలు వరదనీటితో అలుగు పారాయి. వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు.

హష్ ఆయిల్ విక్రేతల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న హష్ ఆయిల్ బాటిల్స్‌తో డీసీపీ శ్రీనివాసరావు

జీడిమెట్ల: ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు ప్రాంతం నుంచి హష్ ఆయిల్ తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్న ముఠాను బాలానగర్ ఎస్వోటీ, మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్వోటీ అడిషనల్ డీసీపీ శోభన్, ఏసీపీ గంగారాంతో కలిసి డీసీపీ టి.శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. సూరారం వెంకటరాంనగర్‌కు చెందిన యతేష్‌వర్మ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేసేవాడు. రాజీవ్ గృహకల్పకు చెందిన మామిడి వెంకట హరికృష్ణ,, గాంధీనగర్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్ స్నేహితులు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు వీరు హష్ ఆయిల్ కొనుగోలు చేసి నగరంలో విక్రయించాలని పథకం పన్నారు. ఇందులో భాగంగా పాడేరుకు చెందిన కొండ బాబును సంప్రదించారు. అతడి వద్ద నుంచి హష్ ఆయిల్ కొనుగోలు చేసి కూకట్‌పల్లి, నిజాంపేట పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందడంతో వారి కదలికలపై నిఘా పెట్టారు. శుక్రవారం బాచుపల్లి, ఎస్వోటీ పోలీసులు నిజాంపేట ఎక్స్‌రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా అటుగా వస్తున్న వారి వాహనాన్ని తనిఖీ చేయగా హష్ ఆయిల్ బయటపడింది. నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 230 బాటిల్స్ హష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. అంతేగాక సనత్‌నగర్ జీహెచ్ఎంసీ గ్రౌండ్ వద్ద ప్రవీణ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 70 బాటిల్స్(350 మిల్లీలీటర్లు) స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కూకట్‌పల్లిలో నాలుగు, చిక్కడపల్లి, ఆసిఫ్‌నగర్ ఠాణాల పరిధిలో ఒకటి చొప్పున కేసులు ఉన్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఎస్వోటీ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్‌ను డీసీపీ అభినందించారు. ఆరు నెలల వ్యవధిలో 150 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వివరించారు.


పోలీసుల అదుపులో నిందితులు

మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని చాలా ప్రాంతాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలోని చెరువులు, కుంటలు నిండిపోయి అలుగు పారుగుతున్నాయి. దీంతో కాలనీ రోడ్ల నుంచి ప్రధాన రహదారులు వరదనీటితో నిండిపోయాయి. కొన్ని కాలనీల్లో వరదనీరు సాఫీగా వెళ్లేందుకు వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం ఉదయం నుంచే మ్యాన్‌హోళ్లను శుభ్రం చేస్తూ కనిపించారు. అటు ప్రజాప్రతినిధులు సైతం స్థానికంగా సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించారు.

– కుత్బుల్లాపూర్







జలదిగ్బంధంలోనే గాజులరామారంలోని మోక్షిత్ ఎన్‌క్లేవ్

ఇక్కడ వానొస్తే.. వరదొస్తది!

కాలనీ మొత్తం ఖాళీ చేయించాలని గతంలో నివేదిక



కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఉమామహేశ్వర కాలనీలో తిరిగి వరద నీరు ఇళ్లలోకి చేరడంతో రెండు గల్లీల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఫాక్స్‌సాగర్ చెరువుకు ఆనుకొని గతంలో ఇక్కడ పలువురికి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేశారు. దీంతో వారు ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. వర్షం పడ్డ ప్రతిసారి ఇళ్లలోకి నీరు చేరడం పరిపాటిగా మారింది. ఇక్కడ చెరువు ఎగువ ప్రాంతంలో ఉన్న ఉమామహేశ్వర కాలనీ మొత్తం ఖాళీ చేయించాలని గతంలో నీటిపారుదల శాఖ అధికారులు నివేదిక తయారు చేశారు. అయితే వివిధ రాజకీయ పక్షాల నాయకులు అభ్యంతరం తెలపడంతో వర్షం పడ్డ ప్రతిసారి ఇదే సమస్య ఎదురవుతూ వస్తోంది. స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కొంపల్లి మున్సిపాలిటీలోని ఉమామహేశ్వర కాలనీలోని ఇళ్లల్లోకి ఫాక్స్‌సాగర్ వరదనీరు ప్రవేశించిన దృశ్యం



మల్లంపేటలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న పోలీసులు

క్యాంపస్‌లోకి.. లేఅవుట్‌లోకి..





బాచుపల్లి పరిధిలోని తెలుగు యూనివర్సిటీ, రామకృష్ణ ఎన్‌క్లేవ్‌లలో వరదనీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అటు బండారి లేఅవుట్‌ను సైతం వరద నీరు చేరింది.

నాలా నిర్మాణం పూర్తికాక..

◆ ఎస్ఎన్‌డీపీ పథకంలో భాగంగా పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి మీనాక్షి మీదుగా వెన్నెలగడ్డ ఎన్నా చెరువు వరకు నాలా నిర్మాణం చేపడుతున్నారు. పనులు పూర్తి చేయడంలో కాంట్రాక్టర్ విఫలం కావడంతో ఇప్పుడు పలు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వల్ల వరద తాకిడి ఎక్కువ కావడంతో మీనాక్షి ఎస్టేట్స్ కాలనీ మొత్తం నీట మునిగింది. బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.



జీడిమెట్ల డివిజన్ మీనాక్షి ఎస్టేట్స్‌లో..

వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు..

◆ మూడు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల డ్రైనేజీ మ్యాన్‌హోల్ ఎక్కడ పడితే అక్కడ జామ్ కావడంతో గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లయ్య పారిశుద్ధ్య సిబ్బందితో శుక్రవారం వివిధ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు.



సాయి అనురాగ్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్

గల్లీని ముంచెత్తిన వరద..



రంగారెడ్డి నగర్‌లోని బస్తీ దవాఖానా పక్క గల్లీని వరదనీరు ముంచెత్తింది. దీంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి తలెత్తింది.

రాకపోకలు నిలిపివేత..



వరద ఉధృతితో దూలపల్లి- కొంపల్లిల మధ్య రాకపోకలను నిలిపివేసిన అధికారులు

రాకపోకలు నిలిపివేత..



కొంపల్లి-బహదూర్‌పల్లిలోని సెయింట్ మార్టిన్స్ కళాశాల వద్ద రోడ్డుపై భారీగా వరదనీరు



గాజులరామారం చింతల్ చెరువు అలుగు పారడంతో గంగమ్మకు పూజలు చేస్తున్న స్థానికులు



సుచిత్ర సెక్షన్ బాపునగర్‌లో మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేయిస్తున్న వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి



ఓక్షిత ఎన్‌క్లేవ్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ రావుల శేషగిరిరావు



భౌరంపేట్‌లోని చెరువును పరిశీలిస్తున్న కౌన్సిలర్ సర్వారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు



దూలపల్లి రోడ్డును మూసి వేయడంతో ఆగిపోయిన స్విగ్గీ సేవలు



జీడిమెట్ల ఎస్వీ కో.ఆపరేటివ్ సొసైటీలో చేరిన వరదనీరు

రాష్ట్రంలో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


సుభాష్‌నగర్: అనుభవజ్ఞుడైన, సమర్థుడైన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం గాజులరామారంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి పట్టిన కల్వకుంట్ల కుటుంబం పీడపోయి రామరాజ్యం రానుందన్నారు. ప్రజల్లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వ లేక, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ప్రజల దృష్టి మరల్చేందుకు డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి బీజేపీయే ప్రత్యామ్నాయమని అన్నారు.

◆ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచే కార్యకర్తలు సమష్టిగా పని చేస్తూ పార్టీని గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, కో కన్వీనర్ రాముగౌడ్, నాయకులు కంది శ్రీరాములు, ఏర్వ వెంకట రమణ, గరిగే శేఖర్ ముదిరాజ్, జగన్మోహన్రావు, కూన రఘుగౌడ్, మోతే శ్రీనివాస్‌యాదవ్, మహేందర్, రాజిరెడ్డి,ఆకుల విజయ్ సాయి, నర్సింగారావు, కుమ్మరి శంకర్, విజయ్‌గుప్తా, విగ్నేష్, గుబ్బల లక్ష్మీనారాయణ, చిలుక, లక్ష్మీనారాయణ, సంతోష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉంటూ అధికారుల సూచనలు పాటించండి

కుత్బుల్లాపూర్: వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అధికారుల సూచనలు పాటించాలని ఎమ్మెల్యే వివేకానంద్ కోరారు. శుక్రవారం ఆయన జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ఎన్‌సీఎల్, గంగాఎంక్లేవ్, అపర్ణ విల్లాస్, కళ్యాణి వరకు ఉన్న రోడ్డును పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో 15 రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రూ.70లక్షల రోడ్డుకు ప్రణాళికలు రూపొందించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. అయితే కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో వర్షాలకు అటువైపుగా వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు.

◆ దీనిపై ఎమ్మెల్యేకు పలువురు ఫిర్యాదు చేయగా ఆయన స్వయంగా వచ్చి పరిశీలించారు. ఎస్ఈ చిన్నారెడ్డి, ఈఈ కృష్ణ చైతన్య, డీఈఈ పాపమ్మ, ఏఈ సురేందర్ నాయక్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, వైష్ణవి ఎన్‌క్లేవ్ ప్రతినిధి రాకేష్ కుమార్,



జీడిమెట్ల డివిజన్‌లో పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

అపర్ణ విల్లాస్ ప్రతినిధులు ఎమ్మెల్యే వివేకానంద్ కలిసి డ్రైనేజీ సమస్యలను వివరించగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇటీవల డ్రైనేజీ పనులు పూర్తికాగానే ఎస్ఎల్ఎన్ అపార్ట్‌మెంట్ వాసులు డ్రైనేజీలో లైన్ కలపడం మూలంగా రాబోయే రోజుల్లో అపర్ణ కూడా ఇందులో కలిపితే ఇబ్బందులు తప్పవన్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ ఎస్ఎల్‌జీ, ఏఈ టైర్స్, మల్లంపేట్, నిజాంపేట్, సాయి నగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సకాలంలో బిల్లులు చెల్లించాలి

కుత్బుల్లాపూర్: విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించి మెరుగైన సేవలు పొందాలని కొంపల్లి సబ్‌స్టేషన్ ఏఈ వినాయక రాథోడ్ ఓ ప్రకటనలో కోరారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు మీ–సేవా, పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే, ఆన్‌లైన్ బ్యాంక్, టీఈ వాలెట్, టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆన్‌లైన్ వైబ్‌సైట్ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పెట్ బషీరాబాద్ కట్ట మైసమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ వివేక్‌రెడ్డి, శైలజా రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శుక్ర, శని, ఆదివారాల్లో జరిగే గణపతి పూజ, అఖండ దీపారాధన, ధ్వజరోహణం, అగ్ని ప్రతిష్ట ,108 కళశాలతో మహాకుంభాభిషేకం, అమ్మవారికి లక్షపార్చన ఉంటుంది. ఆదివారం చండీ వాహనం నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది.

సహాయం కావాలంటే ఫోన్ చేయండి

కుత్బుల్లాపూర్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి ఓ ప్రకటనలో తెలియజేశారు. పారిశుద్ధ్యం, వరదనీటి సమస్యలతో ఇబ్బందులు ఏర్పడితే 084-182-33108, 1-800-425-7590 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే తమ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తారని కమిషనర్ తెలిపారు.

'చలో ఘట్‌కేసర్'కు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

రంగారెడ్డినగర్: ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు రమేష్ మాదిగ ఆధ్వర్యంలో నాయకులు చలో ఘట్‌కేసర్ కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఆగస్టు 2వ వారంలో జరిగే మాదిగ విశ్వరూపం మహాసభలను విజయవంతం చేసేందుకు ఘట్‌కేసర్‌లో సన్నాహాక కార్యక్రమాన్ని చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని నాయకులు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

నిజాంపేట్: కాలనీలు, బస్తీలలో కోట్లాది నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు బొర్రా చందు ముదిరాజ్ ఆధ్వర్యంలో స్ప్రింగ్ విల్లా అసోసియేషన్ సభ్యులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ కాలనీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని.. మౌలిక వసతులు కల్పించాలని కోరగా మేయర్ సానుకూలంగా స్పందించారు. స్ప్రింగ్ విల్లా అసోసియేషన్ సభ్యులు నరేందర్‌రెడ్డి, నరసింహ రెడ్డి, రాము, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు బీఆర్ఎస్ వైపే..

కుత్బుల్లాపూర్: ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ పార్టీ వైపే రాష్ట్ర ప్రజలున్నారని మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శుక్రవారం గండిమైసమ్మలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన మేడ్చల్ నియోజకవర్గ రూరల్ మండలా ముఖ్య కార్యకర్తల సమావేశానికి రాష్ట్ర కార్మిక శాఖామంత్రి మల్లారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన యూత్ ప్రెసిడెంట్‌గా నీరజ్‌గౌడ్‌ను నియమించారు. అదే విధంగా రామకృష్ణ, దుర్గం వినయ్‌రెడ్డి లను వైస్ ప్రెసిడెంట్‌లుగా, విజయ్ ముదిరాజ్‌ను ప్రధాన కార్యదర్శిగా, సంతోష్‌రెడ్డిని సెక్రటరీగా నియమించారు.

◆ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లారెడ్డి, శంభీపూర్ రాజులు మాట్లాడుతూ... ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజశేఖర్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ మహేందర్ రెడ్డి, యువ నాయకుడు భద్రారెడ్డి, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు నందారెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దయాకర్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మధుకర్‌రెడ్డి, వివిధ గ్రామాలు, మండలాల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



నూతన కమిటీ సభ్యులతో మంత్రి మల్లారెడ్డి, ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు